క్లుప్తంగా

ప్రతీ విద్యార్థి బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి

దుగ్గొండి : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని ఏపీజీవీబీ గిర్నిబావి బ్యాంక్ మేనేజర్ వేణుధనుంజయ అన్నారు. మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు జీరో ఖాతాలు అందించడం జరుగుతుందని, ఆధార్‌కార్డు జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్, ఫొటో తీసుకుని వస్తే ఖాతాలు ఇస్తామన్నారు. సైబర్ నేరాలు జరగకుండా ఉండాలంటే ఇతరులకు ఓటీపీలు, ఏటీఎం కార్డు పిన్ నంబర్ చెప్పకూడదని తెలిపారు.

బియ్యం అందజేత



నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని 1వ వార్డుకు చెందిన అడ్డిచెర్ల కొమురయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా స్థానిక వార్డు కౌన్సిలర్ దేవోజు తిరుమలసదానందం సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 50కేజీల బియ్యం అందజేశారు.

'ఆదరణ చూసి మోదీకి వణుకు'

నర్సంపేట : దేశ ప్రజల సమైక్యత, భవిష్యత్ అన్ని మతాల ఐక్యత కోసం రాహుల్‌గాంధీ నాలుగు వేల కిలో మీటర్లు జోడో యాత్ర పూర్తి చేసుకొని దేశ ప్రజలను మమేకం చేశారు.ఈ సందర్భంగా రాహుల్‌గాంధీకి వస్తున్న ఆదరణను చూసి మోదీకి వణుకు పుట్టి కేసులు పెట్టారని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి అన్నారు. రాహుల్‌గాంధీపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన భయపడేది లేదన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



నాగేందర్(ఫైల్)

వరంగల్(పర్వతగిరి) : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన గుండా నాగేందర్(35) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. నాగేందర్ రంగశాయిపేటలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గుండెపోటుకు గురికాగా కుటుంబ సభ్యులు స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగేందర్‌కు భార్య రమ్యకృష్ణ, ఏడాదిన్న కూతురు ఉన్నారు.

పనులు ప్రారంభం

సంగెం : మండలంలోని గవిచర్లలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం సోమవారం మహిళా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ రామా శ్రీనివాస్, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి, ఉపసర్పంచ్ యాకయ్య, శ్రీనివాస్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ స్వాధీనం

సంగెం : మండలంలోని తీగరాజుపల్లి శివారు వ్యవసాయ భూముల్లో ఎలాంటి అనుమతి లేకుండా నెలరోజులుగా అక్రమంగా తవ్వకాలు చేపట్టి విక్రయిస్తున్నారు. ఈ మట్టిని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, వరంగల్‌కు తరలిస్తున్నారని పలు పార్టీల నాయకులు, స్థానికులు తెలిపారు. కాగా సోమవారం కాంగ్రెస్ నాయకులు అక్రమ మట్టితవ్వకాలను అడ్డుకోవడంతో మట్టి మాఫియా నాయకులతో గొడవపడ్డారని తెలిపారు. దీంతో వారు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు సమాచారం అందించారు. దీంతో ఇన్‌చార్జ్ గిర్దవార్ కల్పనను పంపించారు. ఆమె టిప్పర్‌ను మండల కేంద్రంలో పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

చర్య తీసుకోవాలి

చెన్నారావుపేట : మండలంలోని జల్లీలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మొరం తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గరిగె సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ బన్సిలాల్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఎస్సై క్వాటర్స్‌కు తాళం..

నల్లబెల్లి: తహసీల్దార్ కార్యాలయంలో వారం రోజులుగా జరుగుతున్న ఘటనలతో పోలీస్, తహసీల్ శాఖల మధ్య కొనసాగుతున్న వార్ సోమవారం బహిర్గతమైంది. తహసీల్దార్ కార్యాలయంపై అంతస్తులో గదులను ఎస్సై క్వాటర్స్‌గా ఉపయోగించుకుంటున్నారు. ఈక్వాటర్స్‌లో నల్లబెల్లి ఎస్సైగా కొనసాగుతున్న అజ్మీర సురేశ్‌నాయక్ ఉంటున్నారు. తన క్వాటర్స్‌కు గత రెండ్రోజుల క్రితం తాళం వేసుకుని విధులకు వెళ్లాడు. ఆదివారం తన క్వాటర్స్‌కు చేరుకోగా.. తాను వేసిన తాళం కాకుండా.. మరో తాళం వేసి ఉండడాన్ని గమనించాడు. ఆందోళనతో ఎస్సై తాళం పగులగొట్టి గదిలోకి వెళ్లి ఎమైనా దొంగతనం జరిగిందా? అని గదిలో ఉన్న వస్తువులను పరిశీలించారు. దొంగతనం జరుగలేదని నిర్ధారించుకుని జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఇదిలా ఉండగా.. ఎస్సై ఉండే గదికి తాళం లేకపోవడంతో తానే గదికి తాళం వేయమని తహసీల్దార్ దూలం మంజుల సిబ్బందికి సూచించడంతో వారు వేశారని తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



నర్సంపేట: హ్యాండ్ వాష్ చేసుకునే విధానాన్ని తెలుపుతున్న సిబ్బంది



సంగెం : ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, అంగన్‌వాడీ సిబ్బంది

నర్సంపేట : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీలో ఇచ్చే బాలామృతంతో పాటు చిరుధాన్యాలతో చేసిన వంటకాలు తినిపించాలని స్థానిక కౌన్సిలర్ రుద్ర మల్లీశ్వరి అన్నారు. ఈ మేరకు నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని నర్సంపేట-4 అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పోషణ పక్షం సందర్భంగా సోమవారం అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిరుధాన్యాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భోజన సమయంలో పిల్లలకు హ్యాండ్ వాష్ చేయించి శుభ్రత చేసుకునే విధానాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్, సీఆర్పీ సుశీల, ఎండి.గౌసియా, ఆయా సునీత, తల్లుల కమిటీ సభ్యురాలు భవాని, ఆశ కార్యకర్తలు రాజమణి, రమ, రామగిరి మాధవి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం పోషణ్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం గురించి అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ స్వర్ణలత, ఏఎన్‌ఎం రజియాబేగం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు రాధ, మంజుల, శోభ, వినోద పాల్గొన్నారు.



చెన్నారావుపేట: అంగన్‌వాడీ సెంటర్‌లో అన్నప్రాసన చేయిస్తున్న సూపర్‌వైజర్లు, టీచర్లు

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి

సంగెం : ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఎంపీపీ కళావతి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోషణ పక్షంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆహారంలో చిరుధాన్యాలు ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు అరుణాదేవి, ఉమాదేవి, ఎస్‌ఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి: తిర్మలాయపల్లి అంగన్‌వాడీకేంద్రంలో..

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

చెన్నారావుపేట : ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హెచ్‌ఎం రమేష్, సూపర్‌వైజర్ మంజుల అన్నారు. ఈ మేరకు మండలంలోని ఎల్లాయగూడెం యూపీఎస్‌లో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కవిత, టీచర్లు ఉమ, రమ, మంజుల, రాణీ, స్వరూప, సచిదేవి, చిన్నారులు ఉన్నారు.

శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి



ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్‌రావు, పక్కన చెట్టుపెల్లి శివాజీ

సంగెం : ఛత్రపతి శివాజీని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని రైతు రుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని రామచంద్రాపురంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ పరిపాలన దక్షత అందరికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఆరెసంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ, నాయకులు జెండా రాజేష్, మోర్తాల చందర్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, దిగంబరరావు, రాంబాబు, అంజన్‌రావు, సర్పంచ్‌లు బొంపల్లి జయశ్రీదిలీప్‌రావు, కిషోర్‌యాదవ్, జెడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి, ఎంపీటీసీ రజిత, ఆరెసంఘం మండలఅధ్యక్షుడు కిషన్‌రావు, దౌలత్‌బాజీ ధర్మారావు ఉన్నారు.

నష్టం వివరాలు నమోదు చేయాలి



నర్సంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సంగెం : పంటనష్టం సర్వే చేస్తున్న అధికారులు

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : వడగళ్ల వానతో నష్టపోయిన ప్రతీ రైతు పంటలను అధికారులు పరిశీలించి నష్టం వివరాలు నమోదు చేయాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా పంటల సర్వే పారదర్శకంగా కొనసాగుతోందని, రైతులు ఎవరూ ఆందోళన చెందకుండా సర్వేకు సహకరించాలన్నారు. ప్రతీ అధికారి నిర్ణీత సమయం ప్రకారం పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి నివేదిక తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ ఏడీఏ, ఏఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి: ఏడీఏ అవినాష్ వర్మ

చెన్నారావుపేట : ఇటీవల వడగళ్ల వర్షంతో దెబ్బతిన్న పంటల నమోదును పారదర్శకంగా నిర్వహించాలని ఏడీఏ అవినాష్ వర్మ అన్నారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విస్తరణ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వారి వివరాలను ఏఈఓలకు అందించాలన్నారు. అకౌంట్ నంబర్, ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం వివరాలు అందించాలన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఏఓ సూర్యనారాయణ, ఏఈఓలు రఘు, స్మిత, వినయ్, సంపత్ తదితరులు ఉన్నారు.



చెన్నారావుపేట: మాట్లాడుతున్న అవినాష్ వర్మ

పంటనష్టం పరిశీలన

సంగెం : మండలంలోని పలు గ్రామాల్లో ఏఓ యాకయ్య ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పంట నష్టం సర్వే చేశారు. రైతుల వద్ద నుంచి వివరాలు సేకరించారు. ఒక్కో గ్రామ శివారులో మొక్కజొన్న, తదితర వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

పురుగుల మందు డబ్బాతో ఆందోళన

- రుణం తీర్చాలంటూ లీగల్ నోటీసులు జారీ

నెక్కొండ : బ్యాంక్‌లో తీసుకున్న రుణం తీర్చాలంటూ బ్యాంక్ అధికారులు కోర్టు నుంచి లీగల్ నోటీసులు జారీ చేయడంతో మనస్తాపం చెందిన వ్యక్తి బ్యాంక్ ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని సూరిపల్లి గ్రామానికి చెందిన బాబు-రజిత డీసీసీబీ బ్యాంక్ నుంచి రూ.లక్ష చిరువ్యాపార రుణం 2020 జూన్‌లో తీసుకున్నారు. జూలై 2022 వరకు రుణం చెల్లించాల్సి ఉండగా ప్రతినెల కిస్తులు సరిగా చెల్లించలేదు. దీంతో రుణం రూ.80వేలు చెల్లించాలంటూ ఇటీవల బ్యాంక్ అధికారులు రజితకు లీగల్ నోటీసులు పంపించారు. అయితే తాను రూ.70 వేలపైనే చెల్లించానని రజిత భర్త రాజు సోమవారం రాత్రి బ్యాంక్ వద్దకు వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయితే తాను భూమి విక్రయించానని రూ.40 వేలు చెల్లిస్తాను, ఏకకాలంలో రుణం మాఫీ చేయాలని కోరగా బ్యాంక్ అధికారులు నిరాకరించారు. దీంతో ఆత్మహత్య చేసుకుంటానంటూ పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేపట్టాడు. ఇది గమనించిన సూరిపల్లి సొసైటీ సీఈఓ వీరస్వామి, గ్రామస్తులు రాజుకు నచ్చజెప్పి తీసుకెళ్లారు. ఈ విషయంపై డీసీసీబీ మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ రజిత బ్యాంక్ నుంచి తీసుకున్న రుణం సకాలంలో చెల్లించకపోవడంతో ఆమె చెల్లించే కిస్తులు కూడా వడ్డీ కింద జమ అయ్యాయన్నారు. రాత్రి సమయంలో బ్యాంక్ ముందుకు రజిత భర్త రాజు మందు డబ్బాతో వచ్చి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచే శాడన్నారు. ఈ విషయాన్ని బ్యాంకు ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.



ఆందోళన చేస్తున్న బాధితుడు రాజు

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



నర్సంపేట రూరల్ : లక్నెపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



ఖానాపురం: రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ

నర్సంపేట : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 5వ వార్డు సర్వాపురంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేశారు. నాగరాజు, పుట్టపాక కుమారస్వామి, శ్రీనివాస్, వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్, కొప్పు భాస్కర్, మెప్మా ప్రతినిధులు, వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : కంటి వెలుగును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీపీ మోతె కళావతి అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కంటి సమస్యలను తీర్చాలనే ఉద్దేశంతోనే కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోడిశాల రాంబాబు,ఎంపీటీసీ ఉల్లెరావు రజిత, పంచాయతీ కార్యదర్శి అనిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు శిబిరానికి హాజరై కంటి వెలుగు ద్వారా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటిలో సమస్యలు ఉన్న వారికి ప్రభుత్వం ఉచితంగా అద్దాలను పంపిణీ చేస్తోందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, మౌలాన పాల్గొన్నారు.

అప్పులపాలు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే

- మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- నల్లబెల్లిలో కొనసాగిన జోడోయాత్ర



దొంతికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

నల్లబెల్లి : కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో ఏర్పాటు చేస్తే.. కొత్త రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పిన కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమాన్ని విస్మరించారు. ప్రాజెక్టుల పేరుతో తెలంగాణను అప్పుల పాలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని బజ్జుతండా, గుండ్లపహాడ్, గాంధీనగర్, ఒల్లెనర్సయ్యపల్లి, మామిండ్లవీరయ్యపల్లి, పంతులుపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాధవరెడ్డి సోమవారం రాత్రి పాదయాత్ర చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. రైతులు, రైతు కూలీలు, నిరుద్యోగులను పలుకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలో మాధవరెడ్డి ప్రజలను ఉద్దేశిస్తూ మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన రుణ మాఫీ వడ్డీలకే సరిపోలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు అధికారంలోకి వచ్చాయన్నారు. ఈ పార్టీలు కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మేధావులు జనంలోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతూ ఇందిరమ్మ పాలన కోసం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, లక్ష్మణ్ నాయక్, భూక్యా గోపాల్ నాయక్, ఒర్సు తిరుపతి, వైనాల అశోక్, చార్లా శివారెడ్డి, ఇస్తారి శేఖర్ గౌడ్, కడుదూరి కట్టయ్య, గోవింద్, బాబు, మాలోత్ చరణ్ సింగ్, కొంరారెడ్డి, సురేష్, భరత్, సంపత్‌రెడ్డి, ఉపేందర్ రెడ్డి, బత్తిని మల్లయ్య పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠ



చెన్నారావుపేట : మండలంలోని గౌడ కులస్తులు సోమవారం విగ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కుల పెద్దలు దొమ్మటి కార్తిక్, గుళ్ళపెల్లి రమేష్, అధ్యక్షులు గుళ్లపెల్లి విజేందర్‌లు మాట్లాడుతూ.. గౌడ కులస్తుల ఆరాధ్య దైవం కంఠమహేశ్వరస్వామి, ఎల్లమ్మ వనం, మైసమ్మ, ఎర్రమ్మతల్లి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మధు, సాంబయ్య, కత్తి రవి, కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

నల్లబెల్లి : మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినులకు సామాజిక వేత్త బట్టు సాంబయ్య పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేయడం అభినందనీయమని బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్ ఊడుగుల ప్రవీణ్ గౌడ్ అన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రంగాపురం సర్పంచ్ చీకటి ప్రకాశ్, ఎస్‌ఓ సునీత, పులి రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌ను గద్దె దించే వరకు పోరాటం'



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్యగౌడ్

రాయపర్తి : పేపర్ లీకులతో నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందని లీకుల ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడుతామని బీజేపీ రాష్ట్ర నాయకుడు పెద్దగాని సోమయ్యగౌడ్, లేగ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా లీకేజీ అవినీతికి నైతిక బాధ్యత వహిస్తూ ఐటీ మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల కుటుంబాన్ని కాపాడుకోవడంకోసమే బీజేపీపై బురదజల్లే కుట్ర చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, మండల అధ్యక్షుడు వడ్లకొండ రవి, దొంగరి మహేందర్, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి నూనె అనిల్, నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రావణ్, రాపాక ప్రశాంత్, పెండ్యాల గణేష్, మంచాల సుమన్, వేణు, శ్రీను పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



వరంగల్ (పర్వతగిరి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. పర్వతగిరి మండలంలోని మొదటి క్లస్టర్ 16 గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో సోమవారం శ్రీనగర్‌లోని ఓ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే అరూరి రమేష్, ఎమ్మెల్సీ, జిల్లా ఇన్‌చార్జ్ ఎంఎస్ ప్రభాకర్‌రావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

రేపు ఆత్మీయ సమ్మేళనం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట శివారు సత్యం ఫంక్షన్‌హాల్ ఈనెల 29న బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. ఉదయం 9.30గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఇటుకాలపల్లి, ఆకులతండా, ఇప్పలతండా, ముత్యాలమ్మతండా, రాజుపేట, ముత్తోజిపేట, ఏనుగల్‌తండా, గ్రామాల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'బలగం' నటులకు సన్మానం



నటులను సన్మానిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో రూపొందిన బలగం సినిమాలో నటించిన రాయపర్తి మండలకేంద్రానికి చెందిన గుడిబోయిన బాబుతోపాటు ఇతర నటులు కర్తానందం, వేముల ప్రభాకర్‌లను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం సన్మానించారు. ఎన్నో చైతన్య నాటకాలలో నటించిన బాబు బలగం సినిమాలో ఉదాత్తమైన పాత్రను పోషించారన్నారు.

ఐసీడీఎస్ అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..



విచారణ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేట అంగన్‌వాడీ -1 కేంద్రంలో నల్లబెల్లి, రుద్రగూడెం క్లస్టర్ సూపర్‌వైజర్లు ఝాన్సీరాణి, శ్యామల దేవి సోమవారం విచారించారు. ఈ నెల 23న సాక్షిలో ఆహారం అంతంతే..! శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్ వాడీ కేంద్రాన్ని అకస్మికంగా వారు తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలతో పాటు సర్పంచ్ వక్కల మల్లమ్మతో గుడ్లు, నూనె, పప్పు సరఫరాపై చర్చించారు. వారితో రాతపూర్వకంగా వాంగ్మూలాన్ని తీసుకున్నారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, నూనె, పప్పు పంపిణీ రికార్డులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. అనంతరం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలపై అంగన్‌వాడీ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎండీ రహీం, అంగన్‌వాడీ టీచర్లు బంద వెంకటలక్ష్మి, మంగ శరణ్య, ఆయాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పెద్ది' కృషి అభినందనీయం



దుగ్గొండి : నర్సంపేట ప్రాంత రైతుల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ వారికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి అభినందనీయమని రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ బోర్డు చైర్మన్ కూర్మాచలం అనిల్ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శానబోయిన రాజుకుమార్, సింగిల్‌విండో చైర్మన్ ఊరటి మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కొల్లూరి విజయమోహన్ రావు, ఉప సర్పంచ్ జయపాల్‌రెడ్డి, రైతు బంధు కమిటీ చైర్మన్ ఊరటి రవి, జంగిలి రవి, నాంపల్లి సుధాకర్, కందిపల్లి శంకర్ పాల్గొన్నారు.

నియంతృత్వ పార్టీలకు వ్యతిరేకంగా పోరాడాలి

నర్సంపేట: దేశంలో కమ్యూనిస్టు వామపక్ష ప్రగతిశీల సామాజిక శక్తులు అన్ని పాలకవర్గ కార్పొరేట్ నియంతృత్వ పార్టీలకు వ్యతిరేకంగా పోరాడాలని, ప్రత్యామ్నాయం రూపొందించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) జిల్లా కమిటీ సమావేశం కొత్తకొండ రాజమౌళి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అప్రజాస్వామిక ఎమర్జెన్సీ నడుస్తూ దేశ సంపదను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ వర్గాలకు దోచి పెడుతున్నాయన్నారు. జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ స్థానిక కమిటీలు ప్రజా సమస్యలపై చర్చించి ఏప్రిల్‌లో పూలే, అంబేడ్కర్ జయంతి సందర్భంగా ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, బాబురావు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.